క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కోటబొమ్మాళి: కేజీబీవీల్లో ఇంటర్, టెన్త్ చదువుతున్న విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వశిక్షా అసిస్టెంటు మానిటరింగ్ అధికారి జి.లక్ష్మీనారాయణ అన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళిలోని కేజీబీవీలను బుధవారం సందర్శించారు. విద్యార్థినులకు అందజేసిన పుస్తకాలను పరిశీలించారు. విద్యాప్రమాణాలు, సిలబస్‌పై ఆరా తీశారు. అనంతరం భోజనం మెనూ అమలును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కె.లక్ష్మీప్రశాంతి, పీఈటీ రమణమ్మ, అకౌంటెంటు గిరిజ ఉన్నారు.

స్పందన ఫౌండేషన్ వితరణ

సంతబొమ్మాళి: వైజాగ్‌కు చెందిన బొడ్డు ఈశ్వరమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఈమె మండలంలోని నర్సాపురంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. కష్టాల్లో ఉన్నట్టు తెలుసుకున్న పట్టణానికి చెందిన స్పందన ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈశ్వరమ్మకు బుధవారం పది వేల రూపాయలను అందజేసి ఆదర్శంగా నిలిచారు. ఫౌండేషన్ అధ్యక్షుడు షణ్ముఖరావు, సర్పంచ్ భూషణరెడ్డి, ఫాల్గుణరెడ్డి, భువన రెడ్డి, సిమ్మన్న ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు రోహిత్ ఎంపిక


ఎం.రోహిత్

పలాస: రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.రోహిత్ ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డిలో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి జరగనున్న కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు తరఫున రోహిత్ పాల్గొంటాడని పీడీ రామ్‌జీ చెప్పారు. విద్యార్థి రోహిత్‌ను ప్రధానోపాధ్యాయుడు ఎ.వీర్రాజు, పీడీ రామ్‌జీ, పాఠశాల చైర్మన్ సార జోగారావు అభినందించారు.

తక్షణసాయం అందజేత

నందిగాం: నందిగాంకు చెందిన చమళ్ల శ్రావణి ఇటీవల మృతి చెందారు. ఈమె వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో నామినీగా ఉన్న తల్లి సరస్వతికి తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, పెద్దలవునిపల్లి సర్పంచ్ అట్టాడ శ్రీనివాస్‌లు చేతుల మీదగా సరస్వతికి బుధవారం అందజేశారు.

వైభవంగా వెంకటేశ్వర కల్యాణం

వజ్రపుకొత్తూరు రూరల్: రిట్టపాడు గ్రామంలో బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

శివాలయంలో దీపారాధన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండోవార్డు పరిధిలో ఉన్న శివాలయంలో శివస్వాములు శ్రీశైలం దర్శనానికి వెళ్తున్న సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇరుముడు పూజలో ఓం ఆకారంలో దీపాలను వెలిగించారు. రెండో వార్డు కౌన్సిలర్ బడగల సుజాత, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

పాపారావు సేవలు మరువలేనివి

నందిగాం: జిల్లా గొర్రెల సంఘ మాజీ అధ్యక్షుడు ఇప్పిలి పాపారావు సేవలు మరువలేనివి అని పలువురు యాదవ సంఘ నాయకులు అన్నారు. పాపారావు సంస్మరణ సభను నందిగాంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు అమ్మ రామక్రిష్ణ, ఇప్పిలి జగదీశ్వరరావు, సబ్బి జానకీరాం, తాతయ్య పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి

మందస: వర్షాలతో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు కోరారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వరి పంట అరకొరగా పండిందని, దీనికి తోడు తుపానుతో పండిన పంట తడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

ఆస్పత్రికి తరలింపు

టెక్కలి రూరల్: టెక్కలిలో పద్మనాభం అనే మతి స్థిమితం లేని యువకుడు రెండురోజులుగా స్థానికులపై దాడి చేయడంతో పోలీసులు అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఆ యువకుడిని బుధవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మతిస్థిమితం లేకపోవడంతో విశాఖపట్నం మెంటల్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించనున్నట్లు ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

• బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతిని ప్రభుత్వం, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కంచిలిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు హాజరయ్యారు.


కంచిలి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


కాశీబుగ్గలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు తదితరులు


టెక్కలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాలు, ఎస్సీ వెల్ఫేర్ సంఘ ప్రతినిధులు


కంచిలి: సచివాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘ నేతలు


ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు పాఠశాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కోటబొమ్మాళి హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఎంఈవో–1 ఎస్.అప్పలరాజు, హెచ్‌ఎం డి.గోవిందరావు


సంతబొమ్మాళి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి తదితరులు


ఇచ్ఛాపురం రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోర పుష్ప


నందిగాంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు


కోటబొమ్మాళి: మండల కార్యాలయం వద్ద అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ సభ్యుడు చల్ల చిరంజీవి తదితరులు


వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యా నాయకురాలు బమ్మిడి సుగుణ, మహిళలు


కవిటి: కొత్తపుట్టుగలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


సోంపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి నగిరి శరత్‌బాబు


ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం విశ్వనాథం, సిబ్బంది

వర్షం తెచ్చిన కష్టం!


కాశీబుగ్గ: కేటీ రోడ్డులో కొత్తగా వేసిన రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు


కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం గ్రామ పరిసరాల్లో భద్రంగా ఉన్న వరికుప్పలు


కవిటి: కొబ్బరితోటలో కురుస్తున్న వర్షం


కోటబొమ్మాళి: గంగరాంలో నీటమునిగిన వరిచేనును ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

కాశీబుగ్గ, కోటబొమ్మాళి, కవిటి, వజ్రపుకొత్తూరు రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో రైతులు కొంతవరకు ఇబ్బంది పడ్డారు. అలాగే కొన్నిచోట్ల వర్షం నీరు నిలిచిపోయింది. పొలాల్లో చేరిన నీటితో వరి పనలు తడిచిపోయాయి. అయితే భారీగా వర్షం లేకపోవడం రైతులకు ఉపశమన కలిగించింది. కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీలో ఇటీవల కొత్తగా నిర్మించిన రోడ్డుపై నీరు నిలిచిపోయింది. అలాగే కోటబొమ్మాళి మండలం గంగరాం, లఖందిడ్డి, ఎలమంచిలి, హరిశ్చంద్రపురం, శ్రీజగన్నాథపురం, కోటబొమ్మాళి పంచాయతీల్లో కురిసిన వర్షంతో కోసిన వరిపంట నీట మునిగింది. జరిగిన నష్టంపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. వర్షంతో కవిటి మండలంలోని ఉద్దానం ప్రాంతానికి చెందిన ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు రెండు నెలల తరువాత కురిసిన వర్షం కొబ్బరి తదితర ఉద్యానవన పంటలకు లబ్ధి చేకూర్చుతుందని రైతులు చెప్పారు. అయితే వరి పంటకు కొంత నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. వర్షం కారణంగా చలిగాలులు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని వజ్రపుకొత్తూరు మండల వాసులు చెప్పారు. బుధవారం కురిసిన వర్షంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేకపోయామన్నారు.

అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ట


అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించిన దృశ్యం

మందస: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. మందస పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ట బుధవారం జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. భారతజాతికి ఆయన ఎన్నో సేవలందించారని, మేధావిగా, రాజ్యాంగ నిర్మాతగా భారతదేశం భవిష్యత్ ముందే ఆలోచించగలిగారన్నారు. దళిత, పీడిత వర్గాల ఆశాజ్యోతిగా ఆయన నిలిచారని, చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకై గళమెత్తిన మహానీయుడన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు, తహసీల్దార్ బడే పాపారావు, జీఎస్టీ డీప్యూటీ కమిషనర్ బడియా కామరాజు, సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, పొన్నంగి వసంతరావు, తెప్ప పాండురంగారావు, దైవకటాక్షం, మిస్క కృష్ణయ్య, ఎరుమాకు తులసీదాసు, సంక కాళిదాసు, ఇప్పిలి శేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి


డీటీ రామారావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కంచిలి: విద్యార్థులు చక్కగా చదివి ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని కంచిలి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు అన్నారు. గురుకులంలో చదివిన పూర్వ విద్యార్థి రెయ్యి రామారావు పోలాకి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురుకులంలో 1995–96 బ్యాచ్ పూర్వవిద్యార్థులంతా రామారావును బుధవారం సన్మానించి అభినందించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇక్కడ చదువుకున్న వారంతా ఉద్యోగరీత్యా ఎంత ఎదిగినా తమ చిన్నప్పుడు చదువుకున్న స్కూల్‌ను గుర్తుంచుకుని ఇక్కడ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించి ఇప్పుడు చదువుతున విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ అప్పారావు అన్నారు. అంతకుముందు పాఠశాలలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవాది వాస్, బంగారు లోహిత్, కిల్లాడ రాజు, చంద్రశేఖర్, శ్రీధర్, గువ్వాడ సుధాకర్ ఉన్నారు.

కులగణనతో సామాజిక సుస్థిరత


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: ప్రజల సామాజిక సుస్థిరతకు కులగణన దోహదపడుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సచివాలయ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వే చేసేటప్పుడు ఇంటింటికి వచ్చే సచివాలయం సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపడుతున్నారని, వివిధ కులాల స్థితిగతులను గుర్తించేందుకు కులగణన ఉపయోగపడుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.హైమావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఆర్‌బీకె అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, దుర్గాసి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు

మందస: ప్రభుత్వ పథకాల లక్ష్యాల సాధనకు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు అన్నారు. కుంటికోట సమీపంలోని వైటీసీలో 220 మంది సచివాలయం ఉద్యోగులు, 457 మంది గ్రామవలంటీర్లకు సంక్షేమ పథకాలపై నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. టీం వర్క్ చేసినప్పుడే పథకాలు అర్హులకు అందుతాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ తప్పక అందేలా పని చేయాలన్నారు. ఈఓపీఆర్డీ అరసాడ రఘుపతిరావు, ఏపీఎస్‌ఐఆర్డీ ఎంఎటీ దేవి, ఎంఎటీలు కె.జయప్రకాశ్, మజ్జి సోమేషు, జాఫర్, ఖవేశు శేషగిరి, కంచరాన గోపినాథం, కోఆర్డినేటర్ బైపల్లి మోహనరావు పాల్గొన్నారు.

నేడు కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని వివిధ కులాలకు చెందిన సంఘ నాయకులు, గ్రామకార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

కొత్తరోడ్డు పరిశీలన


వర్షం నీటిని పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డు పనులకు నాయకులు, అధికారులు బుధవారం పరిశీలించారు. మూడు రోడ్ల నుంచి పలాస ఇందిరా చౌక్ వరకు నిర్మించిన రోడ్డు వర్షాలకు ఎలా ఉందో తెలుసుకోవడానికి క్షేత్రపరిశీలన చేశారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వరకు ఆరు చోట్ల వర్షం నీరు నిలిచిపోయినట్లు గుర్తించారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డీఈ జి.సునీల్, ఏఈ బి.అవినాష్ ఉన్నారు.

బాధ్యతగా కులగణన


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

పలాస: కుల గణన బాధ్యతగా చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కుల గణనపై సంబంధిత అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుల గణన ఎలా నిర్వహించాలనే విషయంపై వివరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయిక్రిష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింటా జవాబుదారీతనం ఉండాలనే ఉద్దేశంతో సరికొత్త కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వైకుంఠరావు, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, దుర్యోధన, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

• జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


కంచిలి: మండపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


కవిటి:రాజపురంలో బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితరులు

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా సంస్కరణలు, వినూత్నమైన కార్యక్రమాల ద్వారా దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రజారంజకమైన పాలన అందిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండపల్లి సచివాలయం పరిధిలో ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే’కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించిన సేవలు, సంక్షేమం, అభివృద్ధిని డిస్‌ప్లే బోర్డుల్లో వివరిస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరిస్తూ చేపట్టే కార్యక్రమమే ‘వై ఏపీ నీడ్స్ జగన్’ అన్నారు. సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్థానిక సర్పంచ్ మాదిన రజిని ధనుంజయ పాల్గొన్నారు.


నందిగాంలో: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపీపీ శ్రీరామమూర్తి, నాయకులు ఫాల్గుణరావు, జయరాం

కవిటి: రాజపురం–2 సచివాలయంలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ పార్టీ జెండాను ఎగురవేసి పథకాల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత ప్రచారం


మాట్లాడుతున్న ప్రకాష్

కవిటి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. రాజపురం పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపీ సంఖ్య, ఇన్‌పేషెంట్ సేవలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు యలమంచి నీలయ్య, ఎన్ని అశోక్, సనపల జానకీరావు, సనపల కృష్ణారావు, బెందాళం ఢిల్లీబాబు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న తిలక్

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. తురకులకోటలోని దేవుని కృపానిలయం చర్చిలో టెక్కలి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ శ్రీరామమూర్తి, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రీతి అన్వేష్, రెవరెండ్ డాక్టర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి తిలక్ పాల్గొన్నారు. అనంతరం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాస్టర్ ఫెలోషిప్ చీఫ్ అడ్వయిజర్ కణితి అబ్రహం, వైఎస్ ఏలియా, కె.రత్నరాజు, పాస్టర్లు డేవిడ్ మోహన్, రాబర్ట్‌పాల్, కాలేబు, వి.సుధాకర్, కురమాన బాలక్రిష్ణారావు, జడ్యాడ జయరాం, తమిరె ఫాల్గుణరావు, కూన శాంతారావు, అట్టాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ. 399కే ప్రమాద బీమా సదుపాయం

టెక్కలి: తపాల శాఖలో 399 రూపాయలకే రూ. పది లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు టెక్కలి హెడ్ పోస్టల్ మాస్టార్ భానోజీరావు, సహాయాధికారి ప్రతాప్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ యజమాని పేరిట బీమా ప్రీమియం చెల్లిస్తే, అతనికి ఏదైనా ప్రమాదం సంభవించినపుడు రూ. పది లక్షలు బీమా వర్తిస్తోందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక పోస్టల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.